అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి



ఈటలకు వినతిపత్రం అందజేస్తున్న కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కావాల్సిన నిధులు కేటాయించాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను చైర్మన్‌ కొండల్‌రెడ్డి కోరుతూ శనివారం వినతి పత్రం అందజేశారు. అన్నోజిగూడలో అండర్‌ పాస్‌తో పాటు పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వినతిపత్రంలో పేర్కొన్నారు. అందుకు ఈటల సానుకూలంగా స్పందిస్తూ.. మున్సిపల్‌ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈటలను కలిసిన వారిలో వైస్‌ చైర్మన్‌ రెడ్యానాయక్‌, కౌన్సిలర్లు హరిప్రసాదరావు, రాజశేఖర్‌, సాయిరెడ్డి తదితరులున్నారు.

మహిళలకు ఫ్యాషన్‌ డిజైన్‌లో ఉచిత శిక్షణ



శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో హనుమాన్‌, నిర్వాహకులు

ఘట్‌కేసర్‌: పట్టణంలోని ఈడబ్ల్యూఎస్‌ కాలనీలో యూత్‌ ఫర్‌ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా ఫ్యాషన్‌ డిజైన్‌ శిక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ మున్సిపల్‌ అధ్యక్షుడు విప్పర్ల హనుమాన్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాచ్‌లో 30 మందికి అవకాశం లభిస్తుందని, శిక్షణ మూడు నెలల పాటు కొనసాగుతుందన్నారు. మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్‌ మేనేజర్‌ స్వరూప, వలంటీర్‌ అరవింద్‌, అభ్యర్థులు పాల్గొన్నారు.

అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలి



నియామక పత్రాలు అందుకున్న వారితో నిర్వాహకులు

ఘట్‌కేసర్‌: స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో నిరుద్యోగ యువకులకు టీంలీజ్‌, హైదరాబాద్‌ వరుణ్‌ మోటార్స్‌ లిమిటెడ్‌ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో రాణించాలన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



అవగాహన కార్యక్రమంలో సీఐ వెంకటయ్య తదితరులు

కీసర: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కీసర సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో శనివారం రాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు అహ్మద్‌గూడలోని పల్లవి ఇంటర్నేషనల్‌ స్కూల్స్‌లో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌తో ఆరోగ్యం, సమాజంపై జరిగే పరిణామాలను పంచుకున్నారు. పాఠశాల పిల్లలకు ఎన్‌డీపీఎస్‌ యాక్ట్‌ చట్టపరమైన నిబంధనలు, శిక్షలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐలు మధు, హరిప్రసాద్‌, పోలీస్‌ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల క్షేమం కోసం..

సాక్షి, సిటీబ్యూరో: అన్నదాతను ఆపద కాలంలో ఆదుకునే పంటల బీమాపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్షేమ జనరల్‌ ఇన్సూరెన్స్‌ చీఫ్‌ మార్కెటింగ్‌ అధికారి భాస్కర్‌ ఠాకూర్‌ తెలిపారు. రైతుకు ఆర్థిక భరోసా అందించడంలో పంటల బీమాది కీలకపాత్ర అని, ఖరీఫ్‌ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని విభిన్న మాధ్యమాల ద్వారా పెద్దఎత్తున దీనిపై ప్రచారం నిర్వహిస్తున్నట్లు సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో వివరించారు. రైతుకు, ఆయన కూతురుకు మధ్య మనసుకు హత్తుకునేలా తాము చిత్రీకరించిన ఓ ప్రచార చిత్ర విశేషాలను ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

బోడుప్పల్‌: 18వ డివిజన్‌లో జరుగుతున్న అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పనులను బోడుప్పల్‌ మున్సిపల్‌ కమిషనర్‌ రాంలింగం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేసి కాలనీవాసులకు ఇబ్బందుల్లేకుండా చూస్తామన్నారు. ఇదిలాఉంటే విద్యుత్‌ అధికారులు చెట్ల కొమ్మలు తొలగించి అక్కడే పడేశారని ఈస్ట్‌ హనుమాన్‌నగర్‌ కాలనీ అధ్యక్షుడు పులకండ్ల జంగారెడ్డి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషనర్‌ స్పందించి మున్సిపల్‌ సిబ్బందితో వాటిని తొలగించారు. కార్యక్రమంలో డీఈ బాల మురళి, ఉదయనగర్‌ కాలనీ అధ్యక్షుడు యాదన్న, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ మహిపాల్‌, కాంట్రాక్టర్‌ గొడిశాల శ్రీనివాస్‌గౌడ్‌, కాలనీవాసులు గద్దం నరేంద్రకుమార్‌, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి గొప్పదనం తెలుసుకోవాలి

బోడుప్పల్‌: పిల్లలు చిన్నప్పటి నుంచే తండ్రి గొప్పదనం, ప్రాధాన్యతను తెలుసుకోవాలని లోటస్‌ ల్యాప్‌ పబ్లిక్‌ స్కూల్‌ చైర్మన్‌ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఫాదర్స్‌ డే దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాన్న తన కష్టాలను గుండెల్లో దాచుకుని మనకు సంతోషాన్ని ఇస్తారన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





మండల కేంద్రమైన శామీర్‌పేట దర్గా వద్ద కరీంనగర్‌ - హైదరాబాద్‌ రాజీవ్‌ రహదారిలో బస్‌షెల్టర్‌ లేక ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శామీర్‌పేట మండలకేంద్రం కావడం, రాజీవ్‌ రహదారి ఉండటంతో పాటు శామీర్‌పేట దర్గా సమీపంలో జగ్గిరిగుట్టకు చెందిన సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో కళాశాల నుంచి వెళ్లే విద్యార్థినులు బస్‌ షెల్టర్‌ లేక ఎండా, వానకు నరకయాతన అనుభవిస్తున్నారు. అంతేగాక శామీర్‌పేట మండలంలోని లోపలి గ్రామాల ప్రజలు రాజీవ్‌ రహదారి వద్దకు వచ్చి నగరంవైపు, సిద్దిపేట, కరీంనగర్‌ వైపు వెళ్తుంటారు. వీరంతా బస్సులు వచ్చే వరకు ఎండా, వానకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. -శామీర్‌పేట్‌

హోమ్‌.. హోప్‌..



సాక్షి, మేడ్చల్‌ జిల్లా: పేదల సొంతింటి కల నెరవేరబోతోంది. గత ప్రభుత్వం డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి.. లబ్ధిదారులను తీవ్ర నిరాశకు గురిచేసింది. గృహలక్ష్మి పథకంలో మంజూరు చేసిన లబ్ధిదారుల జాబితా రద్దయ్యింది. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై ప్రజల నుంచి దరఖాస్తులను కొత్త ప్రభుత్వం స్వీకరించింది. అలాగే, ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో కూడా ఇందిరమ్మ ఇళ్లపై కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వస్తున్నాయి. ఎన్నికల కోడ్‌ ముగియడంతో వీటిపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభిస్తోంది. అలాగే, గతంలోని ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనకు కార్యాచరణ రూపొందిస్తోంది. వీటితో పాటు కొత్తగా దరఖాస్తులు స్వీకరించేందుకు కూడా సన్నాహాలు చేస్తున్నారు. పారదర్శకత కోసం లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సొంతింటి కల నెరవేరేదెన్నడో?

- అసంపూర్తిగానే 'డబుల్‌' ఇళ్లు
- నిరాశ పరిచిన గృహలక్ష్మి పథకం
- జిల్లాకు 17,500 ఇందిరమ్మ ఇళ్లు
- జిల్లాలో దరఖాస్తులు 1.10 లక్షలు
- ఆశగా ఎదురుచూస్తున్న పేదలు

అసంపూర్తిగా డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లు

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ఇళ్లు లేని నిరుపేదలకు నిర్మిస్తున్న డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల నిర్మాణ పనులు పడకేశాయి. గృహలక్ష్మి పథకం ప్రవేశంతో డబుల్‌ ఇళ్ల నిర్మాణాలపై ఆశలు అడియాశలయ్యాయి. జిల్లాలోని అర్బన్‌ ప్రాంతమైన జీహెచ్‌ఎంసీ పరిధిలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో డబుల్‌ బెడ్‌ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం కాగా, అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పూర్తయిన ఇళ్లను ర్యాండమైజేషన్‌ సాఫ్ట్‌వేర్‌ పద్ధతిలో పంపిణీ చేశారు. (ఇందులో జీహెచ్‌ఎంసీకి సంబంధించిన డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లను మేడ్చల్‌ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నిర్మించినవి కూడా పంపిణీ చేశారు.) అర్బన్‌ అసెంబ్లీ నియోజకవర్గాలైన ఉప్పల్‌, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్‌, కూకట్‌పల్లి పరిధిలో మొదటి దశలో ప్రతి సెగ్మెంట్‌కు 500 చొప్పున 2 వేల మందికి డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లను కేటాయించారు.

ఇళ్లపై స్పష్టత లేకపోవడంతో..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా రూరల్‌ ప్రాంతానికి సంబంధించి అప్పటి ప్రభుత్వం 2,350 డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటి వరకు 683 ఇళ్లు పూర్తి కాగా, ఇందులో 300 ఇళ్ల వరకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే, మిగతా 340 ఇళ్ల నిర్మాణాలు తుది దశలో ఉండగా, మరో 1,329 డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్లు వివిధ నిర్మాణ దశలతో పాటు టెండర్ల ప్రక్రియలో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి డబుల్‌ రూమ్‌ ఇళ్లపై స్పష్టత లేకపోవడంతో కేటాయింపుపై సందిగ్ధం నెలకొంది.

నిరాశపరిచిన గృహలక్ష్మి పథకం

ఇంటి స్థలం ఉండి ఆహారభద్రత కార్డు పొంది.. ఎలాంటి పక్కా ఇల్లు లేని వారి నుంచి గృహలక్ష్మిలో అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 17,090 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోగా, క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు 12,040 మంది లబ్ధిదారులను గుర్తించారు. జిల్లాలో ఒక్క మేడ్చల్‌ అసెంబ్లీ నియోజకవర్గంలోనే 1200 మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. మిగతా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకటి కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఇళ్ల పథకాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో గృహలక్ష్మి లబ్ధిదారులు నిరాశకు గురయ్యారు.

ఇందిరమ్మ ఇళ్లతో చిగురించిన ఆశలు

అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదిలో 3,500 చొప్పున మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 17,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నారు. ఎలాంటి నివాస గృహం లేక సొంతింటి స్థలం, ఆహారభద్రత కార్డు ఉన్న వారికి రూ.5 లక్షలు మంజూరు చేయనున్నారు. దీని కోసం ఆరు నెలలుగా లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించటంతో లబ్ధిదారుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా జనవరి మొదటి వారంలో ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించగా, మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 7.09 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 1,10,228 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో.. నిరుపేద లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్‌: సమాజ నిర్మాణంలో మహిళలే కీలకంగా వ్యవహరించాలని మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్‌ కళాశాల 13వ గ్రాడ్యుయేషన్‌ డే శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఉత్తమ విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మన దేశం ముందు వరుసలో ఉందన్నారు. ఇతర దేశాల్లో సైతం కీలకమైన పదవులు, స్థానాల్లో భారతీయులే ఉన్నారని, అందుకు అంకితభావం, నైపుణ్యాలు, పనిపట్ల నిబద్ధతే కారణమన్నారు. ఇంజినీరింగ్‌ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థినులు తమ నైపుణ్యంతో సమాజంలో మంచి గుర్తింపు సాధించాలని, ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు. అంతకుముందు ఎమ్మార్‌జీఐ డైరెక్టర్‌ షాలినీరెడ్డి, కళాశాల కార్యదర్శి మహేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ మాధవిలత ప్రసంగించారు. మహిళా ఇంజినీర్లుగా, ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో డీన్‌, హెచ్‌ఓడీ, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌లో సీఎస్‌ఐ స్టూడెంట్‌ చాప్టర్‌ ప్రారంభం



సీఎస్‌ఐ స్టూడెంట్‌ చాప్టర్‌ ప్రారంభోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో సీఎంఆర్‌ కళాశాలలో సీఎస్‌ఐ స్టూడెంట్‌ చాప్టర్‌ ప్రారంభించారు. సీఎస్‌ఐ ప్రతినిధులు శ్రీనివాస్‌, శరత్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ దేవదాస్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. మార్చి నెలలో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ శివస్కంద, వెంకటేశ్‌, డీన్‌ రవికుమార్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తాం


గౌతంనగర్‌: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ది సిటిజన్‌ కో–ఆపరేటివ్‌ సొసైటీ వెస్ట్‌ మల్కాజిగిరి శాఖ మేనేజింగ్‌ డైరెక్టర్‌ కేవీ సుబ్బయ్య అన్నారు. గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని హనుమాన్‌పేట్‌ కమ్యూనిటీ హాల్‌లో ఖాతాదారుల సమావేశం శనివారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై గతేడాది జరిగిన ఆర్థిక లావాదేవీలు, ఈ యేడు ఖాతాదారులకు ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఖాతాదారుల సహాయ సహకారాల వల్లే ఇప్పటి వరకు ది సిటిజన్‌ కో–ఆపరేటివ్‌ సొసైటీ నంబర్‌ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌ చైర్మన్‌ వైస్సార్‌ మూర్తి, డైరెక్టర్‌ ఏ. సోమలింగంగౌడ్‌, మేనేజర్‌ ఎస్‌.ఎం. పీరాన్‌, ఏవీ. స్వామితోపాటు ఖాతాదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మేడ్చల్‌రూరల్‌: మండలంలోని రాజబొల్లారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన ఘనాపూర్‌లో శనివారం మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్స చేయాల్సి ఉన్న 32 మందిని ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్‌ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మేఘన, మానస, దేవిక, బబిత, మార్కెటింగ్‌ ఇన్‌చార్జి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న మాజీ మేయర్‌ కావ్య

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ 15వ డివిజన్‌ శాంతినగర్‌లోని శ్రీముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మేయర్‌ మేకల కావ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగభూషణం, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు తెలిపారు.

రక్తదాన శిబిరం



శామీర్‌పేట్‌: మ్యూజిక్‌ డైరెక్టర్‌ చక్రి జయంతి సందర్భంగా మండలంలోని తుర్కపల్లి గ్రామంలో ప్రగతి యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. మహిత్‌ నారాయణ్‌ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 40 మంది యువకులు పాల్గొని తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదానం చేశారు. కార్యక్రమంలో మూవీ డైరెక్టర్‌ బాబు, సింగర్‌ విజయలక్ష్మి, జబర్దస్త్‌ ఫేమ్‌ రాకింగ్‌ రాకేశ్‌, యువజన సంఘం అధ్యక్షులు శ్రీధర్‌, ఉపాధ్యక్షులు షేక్‌ ఇబ్రహీం, ఆర్గనైజర్లు బాబు, మల్లేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

నివాసేతర భవనాల ట్యాక్స్‌ మాత్రమే పెంపు

మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య



ఘట్‌కేసర్‌ కౌన్సిల్‌ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య

ఘట్‌కేసర్‌: మున్సిపాలిటీలో నివాసేతర భవనాల ట్యాక్స్‌ 0.30 శాతం మాత్రమే పెంచనున్నామని మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్‌ కార్యాలయంలో చైర్‌ పర్సన్‌ అధ్యక్షతన, కమిషనర్‌ సాబేర్‌ అలీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్‌ సమావేశంలో బడ్జెట్‌ ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌ పర్సన్‌ మాట్లాడుతూ బక్రీద్‌ ఏర్పాటుకు రూ.1.2 లక్షలు, డ్రైనేజీ మరమ్మతుల కోసం రూ.15 లక్షలు, బీటీ రోడ్డు మరమ్మతుల కోసం రూ.5 లక్షలు, హరితహారం మొక్కల రవాణా కోసం రూ.5 లక్షలు, దుకాణ సముదాయం మరమ్మతుల కోసం రూ.5 లక్షలతో పనులు చేపడతామన్నారు. ఆమోదం తెలిపిన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైస్‌ చైర్మన్‌ మాధవరెడ్డి, కమిషనర్‌ సాబేర్‌ అలీ, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్‌, అనురాధా, నస్రీన్‌ సుల్తానా, నాగజ్యోతి, హేమలత, శశికళ, మల్లేశ్‌, పద్మారావు, జహంగీర్‌, నర్సింగ్‌రావు, రవీందర్‌, కోఆప్షన్‌ సభ్యురాలు అరుణ, ఏఈ సతీశ్‌, మున్సిపల్‌ అధికారులు పాల్గొన్నారు.

నాగారం అభివృద్ధికి రూ.6.48 కోట్లు



సమావేశంలో మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి, కౌన్సిలర్లు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం పార్టీలకతీతంగా నిధులు కేటాయిస్తున్నట్లు నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్‌ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్‌ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్‌ పరిధిలోని 20 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.6.48 కోట్ల నిధులను కేటాయించాలని సమావేశంలో నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నిధులతో కౌన్సిలర్ల ప్రతిపాదనల మేరకు ఆయా వార్డులో అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పనులు, సీసీ రోడ్లు, తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్య పనుల నిమిత్తం రూ.20 లక్షలు వెచ్చించాలని నిర్ణయించడం తీసుకున్నట్లు తెలిపారు. అందరి సహకారంతో మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌యాదవ్‌, కమిషనర్‌ రాజేంద్రకుమార్‌, మేనేజర్‌ చంద్రశేఖర్‌, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు, మున్సిపల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రమ, క్రమశిక్షణను నమ్ముకుంటే విజయం



మాట్లాడుతున్న డాక్టర్‌ రాంకిషన్‌

కీసర: శ్రమ, క్రమశిక్షణను నమ్ముకుంటే విజయం వరిస్తుందని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ భారత ప్రభుత్వ డిప్యూటీ డ్రగ్స్‌ కంట్రోలర్‌ డాక్టర్‌ ఎ.రాంకిషన్‌ అన్నారు. నాగారం మున్సిపల్‌ పరిధిలోని రాంపల్లిలో గల కేజీఆర్‌ కళాశాల ఏర్పాటై 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం నిర్వహించిన క్రిస్టల్‌ వార్షిక సంబరాలతో పాటు అద్వయ మేనేజ్‌మెంట్‌ ఫెస్టివల్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చాలా వెనుకబడిన ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఈ స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. గురువులు, తల్లిదండ్రులను గౌరవించడంతో పాటు జీవితంలో ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దాన్ని సాధించే విధంగా విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు. అభివృద్ధిలో పరుగులు తీస్తున్న మనదేశంలో రానున్న రోజుల్లో యువతకు మంచి అవకాశాలు ఉంటాయని, ఇందుకు యువత సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్‌ గోవిందరెడ్డి, కళాశాల డైరెక్టర్‌ పీవీ రమణారావు, కళాశాల ప్రిన్సిపాల్‌ ఎస్‌.విజయలక్ష్మీ, ప్రొఫెసర్లు విజయకుమార్‌, సునీత, రంగేశ్వర్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, వేణు, శ్రీనివాస్‌, భాషా తదితరులు పాల్గొన్నారు.